సాక్షి
కామారెడ్డి

సోమవారం । 19 । జూన్ । 2023



పల్లె వెలుగుల్లో టి-9 టికెట్

పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధుల కోసం ఆర్టీసీ టి-9 పథకాన్ని ప్రవేశపెట్టింది.

- IIలో ▸



ప్రమాదం అంచున..

నాగిరెడ్డిపేట మండలం మేజర్ వాడి గ్రామంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయి.

- IIIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.9 /29.1

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'డబుల్' అవకతవకలపై చర్చకు సిద్ధమా!

మాజీ మంత్రి షబ్బీర్ అలీ



కామారెడ్డి టౌన్: డబుల్ బెడ్ రూం ఇళ్లలో అవకతవకలపై ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చర్చకు రావాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ సవాల్ విసిరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ కన్వీనర్‌గా నియమితులైన సందర్భంగా షబ్బీర్ అలీని నాయకులు ఘనంగా సన్మానించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నాణ్యతపై చర్చకు తాను సోమవారం ఉదయం పది గంటలకు టేక్రియాల్ వస్తానని, గంప గోవర్ధన్ కూడా రావాలని సవాల్ విసిరారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

భిక్కనూరు: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి అధికారాన్ని 'హస్త'గతం చేసుకుంటుందని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) కన్వీనర్, మాజీ మంత్రి మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. ఆదివారం భిక్కనూరు మండలం కంచర్ల గ్రామానికి చెందిన 30 మంది యువకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటుందన్నారు. నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, మద్ది చంద్రకాంత్‌రెడ్డి, చిట్టెడి సుధాకర్‌రెడ్డి, సాయగౌడ్, దేవరాజుగౌడ్, పాత శివకృష్ణమూర్తి పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే



కామారెడ్డి టౌన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన ఎన్ఎస్‌యూఐ జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారమే లక్ష్యంగా ప్రజల్ని మోసం చేస్తూ, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా తయారు చేసిందన్నారు. మాయమాటలతో ప్రజల్ని మోసం చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. జిల్లాలోని అన్ని స్థానంలో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ఇందుకోసం ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని కోరారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ నుంచి ఎంతో మంత్రి కాంగ్రెస్‌లో లీడర్లుగా ఎదిగారని అందుకు తానే నిదర్శనం అని గుర్తు చేశారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరెని సందీప్, కాంగ్రెస్ నాయకులు సుబాష్‌రెడ్డి, పండ్ల రాజు తదితరులున్నారు.

తెయూకు రెండు గిరిజన హాస్టల్స్ మంజూరు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీకి బాలుర, బాలికల హాస్టల్స్ మంజూరైనట్లు రిజిస్ట్రార్ యాదగిరి తెలిపారు. ఈ హాస్టల్స్ కేవలం గిరిజన పేద విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, తెయూకు మధ్య హాస్టల్స్ నిర్మాణానికి సంబంధించి ఒప్పందం జరిగిందన్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, తెయూ రిజిస్ట్రార్ యాదగిరి ఈ ఒప్పంద పత్రాలు(ఎంవోయూ) మార్చుకున్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ సెక్రెటరీ, కమిషనర్ క్రిస్టినా జెడ్ చోంగ్తూ, చీఫ్ ఇంజినీర్ శంకర్, ఏఈ వినోద్ పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌కు ప్రజలు ఎవరూ రావొద్దని సూచించారు.

బడి బస్సులు భద్రమేనా?



- 'ఫిట్‌నెస్' లేకున్నా నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం
- జిల్లాలో 260కి పైగా స్కూల్ బస్సులు
- పట్టించుకోని రవాణా శాఖ అధికారులు

కామారెడ్డి టౌన్: జిల్లావ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభమయ్యాయి. కాస్త దూరంగా ఉన్నా.. పిల్లలను మంచి బడిలో చదివించాలని తల్లిదండ్రులు ఆరాటపడుతుంటారు. ఇంటికి దూరంగా ఉండే పాఠశాలలకు వెళ్లేందుకు బడి బస్సులకు వేలకు వేలు చెల్లిస్తారు. అవైతే తమ బిడ్డలను భద్రంగా తీసుకెళ్లి.. క్షేమంగా ఇంటికి చేరుస్తాయని విశ్వసిస్తారు. కానీ పాఠశాలల యాజమాన్యాలు నిర్వహిస్తున్న బడి బస్సులు భద్రంగానే ఉన్నాయా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. యాజమాన్యాలు నిబంధనలను పాటించడం లేదన్న విమర్శలు ఏటా వస్తుంటాయి. బస్సుల నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఆర్టీఏ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో చాలా ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ఫిట్‌నెస్ లేని బస్సులను వినియోగిస్తున్నాయి. అనుభవం లేని డ్రైవర్లను పనిలో పెట్టుకొని విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

110 బస్సులకే 'ఫిట్‌నెస్'

జిల్లాలో 450కి పైగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, సుమారు 260కి పైగా స్కూల్ బస్సులు ఉన్నాయి. ఈ బస్సులకు గతేడాది ఇచ్చిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గత నెల 15తో ముగిసింది. ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభమై.. ప్రైవేట్ బడుల బస్సులు పిల్లలను తరలిస్తున్నాయి. కానీ సగం బస్సులు కూడా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందలేదు. వాస్తవానికి బస్సులను ఆర్టీఏ కార్యాలయానికి తీసుకువస్తే అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవాల్సి ఉంటుంది. కానీ అధికారులు మధ్యవర్తుల ద్వారా పరిశీలన చేయకుండానే కొన్ని పాఠశాలల అన్ని బస్సులకు ఒకే సారి సర్టిఫికెట్ తీసుకుంటున్నట్లు తెలిసింది. కొన్ని మండలాల్లో పాఠశాలల యాజమాన్యాలు అసలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండానే బస్సులను నడుపుతున్నాయి. కొందరు బస్సులకు పైన రంగులు వేసి లోపల బాగా లేకున్నా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అడ్డదారిలో తీసుకుంటున్నట్లు ఆరోపణలు లేకపోలేవు. ఇందులో కొందరు ఆర్టీఏ ఏజెంట్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారు. అధికారులు మామూళ్లు తీసుకొని బస్సులను చూడకుండానే గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 110 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకున్నారు. అలాగే 15ఏళ్ల కాలం చెల్లిన బస్సులు 60కిపైగా ఉన్నట్లు సమాచారం. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద గల ఓ కార్పొరేట్ స్కూల్ నిబంధనలకు విరుద్ధంగా ట్రావెల్స్ బస్సును పిల్లలను తీసుకు రావడానికి వినియోగిస్తోంది.



వెనకాల అద్దం లేని స్కూల్ బస్సు(ఫైల్)



ట్రావెల్స్ బస్సును వినియోగిస్తున్న ఓ స్కూల్

పలు ఘటనలు..

నాలుగేళ్ల క్రితం సిరిసిల్ల రోడ్డులోని బైపాస్ బ్రిడ్జి వద్ద డ్రైవర్ నిర్లక్ష్యంతో ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్సు ప్రమాదానికి గురై 14 మంది విద్యార్థులకు గాయాలు అయ్యాయి.

పాతరాజంపేట వద్ద రెండేళ్ల క్రితం ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో చెట్టును ఢీకొంది. విద్యార్థులు స్వల్పగాయాలతో బయట పడ్డారు.

నిబంధనలు ఇలా..

- బస్సుకు నాలుగువైపులా మూలల్లో ఫ్లాషింగ్ లైట్లు అమర్చాలి. విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ఇవి వెలగాలి.
- డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం ఉండాలి. వయసు 60 ఏళ్లకు మించొద్దు.
- ప్రతీ నెల స్కూల్ ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ బస్సులను తనిఖీ చేయాలి.
- బస్సులో ప్రథమ చికిత్స కిట్ ఉండాలి.
- ఇంజిన్, బాడీ కండీషన్‌లో ఉండాలి.
- కన్వెక్షన్, క్రాస్ మిర్రర్ ఉండాలి.
- విద్యార్థుల బ్యాగ్‌లను భద్రపరుచుకునేందుకు ర్యాక్‌లు ఉండాలి.
- బస్సుకు ఎమర్జెన్సీ విండోలు ఉండాలి.
- విండోలకు తప్పకుండా గ్రిల్స్ బిగించాలి.
- బస్సులను అతివేగంగా నడుపొద్దు.

ఫిట్‌నెస్ లేకుండా నడిపితే చర్యలు

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కాలం చెల్లిన బస్సులను నడిపిస్తే వారిపై కఠిన చర్యలతో పాటు భారీగా జరిమానా విధిస్తాం. అలాగే ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్డెక్కితే వాటిని సీజ్ చేస్తాం. అనుభవం ఉండి హెవి వెహికిల్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లు ఉండాలి. – శ్రీనివాస్‌రెడ్డి, ఎంవీఐ, కామారెడ్డి

దేశానికి ఆదర్శంగా సంక్షేమ పథకాలు

- మిషన్ భగీరథతో తాగునీటి ఎద్దడి పరిష్కరించాం
- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్‌సింధే

నిజాంసాగర్: సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులైన పొరుగు రాష్ట్రాల ప్రజలు తెలంగాణలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. మద్నూర్ మండలం శేఖాపూర్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీళ్ల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తాగునీటి కోసం మహిళలు ధర్నాలు, రాస్తారోకోలు చేశారన్నారు. స్వరాష్ట్రంలో తాగునీటి గోస లేకుండా ఇంటింటికి మిషన్ భగీరథ జలాలను అందిస్తున్నారని చెప్పారు.

భారత జట్టుకు ఎంపిక

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం మిట్టాపల్లికి చెందిన గుండ వినయ్ భారత సాఫ్ట్‌బాల్ జూనియర్ జట్టుకు ఎంపికైనట్లు సర్పంచ్ గణేశ్ తెలిపారు. ఆదివారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వినయ్‌ను సత్కరించి రూ. 5వేలు నగదు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ఈ నెల 23, 24వ తేదీల్లో జపాన్ దేశంలో జరిగే జూనియర్ ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీలకు వినయ్ ఎంపిక కావడం మిట్టాపల్లికి గర్వకారణమన్నారు. గ్రామ క్రీడాకారులకు తన వంతు సహాయసహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు.

భగీరథతో ఇంటింటికి మంచినీరు

- జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం
- ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ అధికారంలోకి వస్తాం
- 'మంచినీళ్ల పండుగ'లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



మిషన్ భగీరథ సంపును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ గోవర్ధన్, ఎమ్మెల్యేలు సురేందర్, హన్మంత్ సింధే

సదాశివనగర్: సీఎం కేసీఆర్ మిషన్ భగీరథతో ఇంటింటికి మంచి నీళ్లు అందిస్తున్నారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని మర్కల్ మల్లన్నగుట్ట వద్ద గల మిషన్ భగీరథ ప్లాంట్ వద్ద 'మంచి నీళ్ల పండుగ' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్‌సింధేతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి ప్రతిపక్ష నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అభివృద్ధిని చూసి గర్వపడాలే గాని, విమర్శించడం సిగ్గు చేటన్నారు. దేశంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి బీజేపీ నానా తంటాలు పడుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో మంచి నీటి ఎద్దడిని తీర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. నీటి ఎద్దడి లేకుండా మిషన్ భగీరథ ద్వారా సురక్షితమైన నీటిని అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం ఏర్పడక ముందు తాను ఏ గ్రామానికి వెళ్లిన మహిళలు రోడ్డుకు అడ్డంగా బిందెలు పెట్టి నీటి ఎద్దడిని తీర్చాలని ఆందోళన చేపట్టేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి మంచి నీరు అందించి మహిళల కష్టాలు తీర్చిందన్నారు. తాము నిజాయితీగా ఉన్నామని, ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ తిరిగి రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

నీటి ఎద్దడి పరిష్కరించాం..

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాక ముందు మహిళలు వ్యవసాయ బోరు బావుల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకునే పరిస్థితి ఉండేదన్నారు. తాడ్వాయి మండలంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండేదని దాన్ని శాశ్వతంగా పరిష్కరించామన్నారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంచినీళ్ల పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. భగీరథ నీటిలో పుష్కలమైన లవణాలు ఉంటాయన్నారు. అనంతరం మిషన్‌భగీరథ ప్లాంట్‌ను విప్ గోవర్ధన్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లక్ష్మీనారాయణ, ఏఈ శ్రీధర్ రెడ్డి, ఎంపీపీలు అనసూయ, దశరథ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి, సీడీసీ చైర్మన్ నర్సయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సర్పంచ్‌లు సంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

శుభకార్యాలకు బ్రేక్!

- ఆషాఢ మాసం, అధిక శ్రావణం
- రెండు నెలల పాటు ముహూర్తాలు లేవు

సాక్షి, కామారెడ్డి: ఆషాఢ మాసం, తర్వాత అధిక శ్రావణ మాసంతో రెండు నెలల పాటు శుభ ముహూర్తాలు లేవు. దీంతో వ్యాపారాలు పడిపోనున్నాయి. అలాగే కులవృత్తుల వారి ఉపాధికి ఆటంకం కలుగనుంది. ఈ నెల 19 నుంచి జూలై 17 వరకు ఆషాఢ మాసం కావడంతో ఎలాంటి ముహూర్తాలు ఉండవు. తర్వాత శ్రావణ మాసంలో ఎన్నో శుభ ముహూర్తాలు ఉండేవి. అయితే అధిక మాసం వస్తుండడంతో శుభ ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు. జూలై 18 నుంచి ఆగస్టు 16 వరకు అధిక శ్రావణంతో ఎలాంటి ముహూర్తాలు పెట్టరు. దీంతో ఈ రెండు నెలల పాటు శుభకార్యాలు జరిగే అవకాశం లేదు. కాగా వరుసగా రెండు నెలల పాటు ముహూర్తాలు లేకపోవడతో ఫంక్షన్ హాళ్లు వెలవెలబోయే పరిస్థితి నెలకొంది. టెంట్ హౌస్‌లు, సౌండ్ సిస్టం, డెకరేషన్ వంటి పనులు చేసేవాళ్లంతా ఖాళీగా ఉండాల్సిందే. ముహూర్తాలకు సంబంధం లేని కార్యాలు పెద్దగా ఉండవు. ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించి ప్రైవేటు బస్సు సర్వీసులు, కార్లు, ఇతర వాహనాలకు కూడా పెద్దగా పని లేకుండాపోతుంది.

వృత్తుల వాళ్లు ఖాళీగానే..

రెండు నెలల పాటు ముహూర్తాలు లేకపోవడంతో వృత్తుల వాళ్లు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి. పెళ్లిళ్ల సీజన్‌లో ఫర్నీచర్ తయారీ, బంగారం ఆభరణాల తయారీ, బట్టలు కుట్టే దర్జీలు.. ఇలా ఆయా కుల వృత్తుల వాళ్లకు చేతినిండా పనిదొరికేది. ప్రస్తుతం శుభాకార్యాలు లేకపోవడంతో ఆయ వృత్తులతో పాటు పురోహితులు కూడా ఖాళీగా ఉండాల్సిందే. బ్యాండు మేళం, డప్పులు కొట్టే వాళ్లకూ పని లేకుండాపోతుంది. వంటల వాళ్లు, క్యాటరర్స్ పరిస్థితి అంతే.

వ్యాపారాలకూ దెబ్బే..

శుభ ముహూర్తాలు లేకపోవడంతో వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగనున్నాయి. కిరాణ వ్యాపారాలు, లేడీస్ ఎంపోరియంలు, బట్టల దుకాణాలు, స్టీల్ సామాన్ల దుకాణాలు, బంగారం దుకాణాల్లో విక్రయాలు నిలిచిపోనున్నాయి. ఫంక్షన్లు, పెళ్లిళ్లు ఉంటేనే వ్యాపారాలు జోరుగా సాగుతాయి. ముహూర్తాలు లేకపోవడంతో ఆయా వ్యాపారాలకు తీవ్ర ఆటంకం కలుగనుంది. పెళ్లిళ్లు, ఫంక్షన్లతో మటన్, చికెన్ అమ్మకాలకు భారీ ఎత్తున గిరాకీ ఉండేది. ఇప్పుడు వాళ్లకు కూడా గిరాకీ తగ్గిపోనుంది. క్యాటరింగ్ చేసే వారు కూడా ఉపాధి కోల్పోనున్నారు.

పంటల సాగుకు భరోసా

- నీటితో కళకళలాడుతున్న చెక్ డ్యాములు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



బాన్సువాడ శివారులో నిండుగా ఉన్న చెక్‌డ్యాం

నిజాంసాగర్: భూగర్భ జలాల పెంపు, వృథా నీటికి అడ్డుకట్ట వేసేందుకు నిర్మించిన చెక్ డ్యాములు నీటితో కళకళలాడుతున్నాయి. వాగులు, నదుల్లో వరద నీరు నిలిచి ఉండేలా, నాన్‌కమాండ్ ఏరియా కు సాగు నీటి సరఫరాకు నిర్మించిన చెక్ డ్యాములు సత్ఫలితాలనిస్తున్నాయి. జిల్లాలో రూ.171.87 కోట్లతో 41 చెక్‌డ్యాముల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. రెండేళ్ల కిందట వీటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే కామారెడ్డి నియోజకవర్గంలో 5 చెక్‌డ్యాములు, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 18, బాన్సువాడ నియోజకవర్గంలో ఒకటి, జుక్కల్ నియోజకవర్గంలో 2 చెక్‌డ్యాములు పూర్తయ్యాయి. మిగతా ప్రాంతాల్లో పనులు పురోగతిలో ఉన్నాయి.

నిండుకుండలా..

చెక్‌డ్యాములతో వాగులు, నదుల్లో నీటి నిల్వలు నాన్‌కమాండ్ ఏరియా ప్రాంత ఆయకట్టు పంటల సాగుకు భరోసానిస్తున్నాయి. వర్షాలు పడకున్నా ప్రస్తుతం చెక్ డ్యాములు నిండుకుండలా కళకళలాడుతుండటంతో ఆయకట్టు ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెక్‌డ్యాముల్లో పూర్తిస్థాయి నీటి నిల్వలు ఉండటంతో లిఫ్టులు, ఆయకట్టు ప్రాంత రైతులు పంటల సాగుకు నారుమళ్లను సిద్ధం చేసుకున్నారు.

సాగులోకి బీడు భూములు



తాతల కాలం నుంచి బీడుగా ఉంటున్న భూములు చెక్‌డ్యాం నిర్మాణంతో సాగులోకి వచ్చాయి. చెక్‌డ్యాముల నిర్మాణంతో రైతుల పాలిట సీఎం కేసీఆర్ కేసీఆర్ దేవుడు అయ్యిండు. ఎండకాలంలోనూ చెక్‌డ్యాం నిండుగా ఉండటంతో సాగుకు సిద్ధమవుతున్నాం.

– మహేందర్‌రెడ్డి, రైతు, అన్నాసాగర్

సత్ఫలితాలనిస్తున్నాయి



మంజీర నదితో పాటు వాగులపై నిర్మించిన చెక్‌డ్యాములు సత్ఫలితాలనిస్తున్నాయి. ఒక్కో చెక్‌డ్యాం ద్వారా 400 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. బాన్సువాడ శివారులోని నాగారం చెక్‌డ్యాంతో మంజీర నది జళకళను సంతరించుకుంది.

– శ్రీనివాస్, నీటి పారుదలశాఖ సీఈ, కామారెడ్డి

పాలన గాడిన పడేనా..?

- అవినీతి కేసులో తెయూ వీసీ జైలుకు..
- అక్రమార్కుల్లో భయాందోళనలు



తెయూ(డిచ్‌పల్లి): రెండు నెలలుగా వివాదాలకు నిలయంగా మారిన తెలంగాణ యూనివర్సిటీలో ఇప్పటికైనా పాలన గాడిన పడుతుందని విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఆశిస్తున్నారు. ముఖ్యంగా సరైన అడ్మినిస్ట్రేషన్ లేకపోవడంతో అకౌంట్స్, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్స్, పరీక్షల విభాగం కంట్రోల్ తప్పాయి. కొన్ని విభాగాల్లో జూనియర్ అసిస్టెంట్ స్థాయి సిబ్బంది కంట్రోల్ చేసే పరిస్థితులు నెలకొన్నాయి. తెయూ వీసీ రవీందర్ ఒక బయట వ్యక్తిని అనధికారికంగా తన పీఏగా పెట్టుకుని అతడి ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. ఒక సమయంలో రెగ్యులర్ అధ్యాపకులు, ఉద్యోగులను ఆ వ్యక్తి బెదిరింపులకు గురి చేశాడంటే వర్సిటీలో అతడి హవా ఎలా నడిచిందో చెప్పవచ్చు. ఇలా వీసీ రవీందర్ అవినీతి, అక్రమాలు, ఏకపక్ష నిర్ణయాలతో వర్సిటీ పరువు, ప్రతిష్టలు రాష్ట్ర వ్యాప్తంగా బజారున పడ్డాయి. వీసీ చర్యలు మితిమీరడంతో కన్నెర్ర చేసిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈసీ ఫిర్యాదు మేరకు వర్సిటీపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు జరిపింది. పలు విభాగాల్లోని కీలకమైన ఫైళ్లు, రికార్డులు, కంప్యూటర్ హార్డ్ డిస్కులు, సీపీయూలు స్వాధీనం చేసుకుని విచారణ జరుపుతున్నారు. అలాగే వీసీ కదలికలపై ఏసీబీ నిఘా పెట్టింది. ఒకవైపు ఇంత జరుగుతున్నా బేఖాతరు చేస్తూ నన్నెవరూ ఏం చేయలేరనే ధీమాతో వీసీ రవీందర్, ఒక ప్రైవేటు కళాశాలలో పరీక్షా కేంద్రానికి అనుమతి ఇచ్చేందుకు రూ. 50వేలు లంచం తీసుకుంటూ నేరుగా ఏసీబీ అధికారులకు పట్టుబడడం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది.

అక్రమార్కులపై చర్యలకు సిద్ధం


వీసీ రవీందర్ అవినీతి, అక్రమాలకు, ఈసీ అనుమతి లేకుండా విచ్చలవిడి కొనుగోళ్లు, చెల్లింపులు, నిధుల దుబారాకు సహకరించిన ఇద్దరు మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్లపై వారం రోజుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉందని తెలిసింది. వీరితో పాటు వీసీ ఆర్థిక అక్రమాలకు సహకరించిన అకౌంట్ సెక్షన్, ఎస్టాబ్లిష్‌మెంట్, ఇంజినీరింగ్ అధికారులపై కూడా చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. విజిలెన్స్ విచారణలో అకౌంట్స్ సెక్షన్ సూపరింటెండెంట్ రూ. 32లక్షలు డ్రా చేసినట్లు తేలినట్లు సమాచారం. వర్సిటీ భవనాలు, హాస్టల్స్‌లో వివిధ రకాల మరమ్మతుల పేరిట అధికంగా బిల్లులు డ్రా చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు.

ఇన్‌చార్జి వీసీ వచ్చాకే..

అవినీతి కేసులో ఏసీబీకి చిక్కి వీసీ జైలు పాలయ్యారు. ప్రభుత్వం నుంచి వేతనం తీసుకునే వారు ఎవరైనా ఏదైనా కేసులో 48 గంటలకు పైగా జైలులో ఉంటే వారు సస్పెండ్‌కు గురవుతారు. దీంతో రెండు మూడు రోజుల్లో తెయూకు ఇన్‌చార్జి వీసీని నియమించే అవకాశం ఉంది. ముఖ్యంగా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వాకాటి కరుణను ఇన్‌చార్జి వీసీగా నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఇన్‌చార్జి వీసీ నియామకం తర్వాతే శనివారం 61వ పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలు చేసే అవకాశం ఉంది.

క్లుప్తంగా

హాకీ హనుమంతు అనారోగ్యంతో మృతి


హాకీ హనుమంతు (ఫైల్‌)

ఆర్మూర్‌టౌన్‌: హాకీ ఇంటిపేరుగా మార్చుకుని ఆర్మూర్‌లో హాకీ క్రీడాభివృద్ధికి కృషిచేసిన విశ్రాంత ఫిజికల్‌ డైరెక్టర్‌ హనుమంతు(74) అనారోగ్యంతో మృతిచెందారు. ఆర్మూర్‌లోని రాంనగర్‌లో నివాసం ఉండే హనుమంతు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఈక్రమంలో ఆదివారం ఆరోగ్యం మరింత క్షీణించడంతో స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆర్మూర్‌లో ఎందరో హాకీ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించడంలో హనుమంతు ఎంతో కృషిచేశారు. ఆర్మూర్‌లో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో క్రీడ పోటీలు నిర్వహించడంలో కీలకపాత్ర వహించారు. గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఆఫ్రో ఆసియాన్‌ క్రీడల్లో కజిగిస్థాన్‌ జట్టుకు లైజన్‌ అధికారిగా రాణించారు. నాలుగో ఆసియా మహిళ హాకీ చాంపియన్‌ షిప్‌ జట్టులో కూడా భారత జట్టు మేనేజర్‌గా, లైజన్‌ అధికారిగా మెప్పుపొందారు. హైదారబాద్‌లో నిర్వహించిన జాతీయ క్రీడల్లో రాష్ట్ర మహిళ హాకీ జట్టుకు మేనేజర్‌గా వ్యవహరించారు.

విద్యాదినోత్సవాన్ని జయప్రదం చేయాలి

నిజామాబాద్‌అర్బన్‌: ప్రతి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యాదినోత్సవాన్ని విజయవంతం చేయాలని డీఈవో దుర్గాప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఈనెల 20న విద్యాదినోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వేడుకల్లో భాగంగా గ్రామ స్థాయిలో ర్యాలీలు నిర్వహించడం, తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులను పిలిచి జాతీయ జెండా ఆవిష్కరించడం, ప్రతిభ కనబర్చిన టీచర్లకు అవార్డులు అందజేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనభర్చిన టీచర్లకు, 10 మంది ప్రధానోపాధ్యాయులకు, 15 మంది టీచర్లకు, స్కూల్‌ మేనేజ్‌మెంట్‌ కమిటీ వారు 5, దాతలకు ఇద్దరికి టీఎస్‌ఎంఎస్‌ మేళాలో ప్రతిభ కనబర్చినవారికి10 మందికి అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలి



నిజామాబాద్‌అర్బన్‌: టీచర్ల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి సత్యానంద్‌ డిమాండ్‌ చేశారు. నగరంలోని యూటీఎఫ్‌ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీచర్ల ఖాళీల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. బదిలీలు, పదోన్నతులు లేక టీచర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సబ్జెక్టు టీచర్‌ల కొరత ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ కార్య క్రమంలో సంఘ నాయకులు రమేష్‌, సిరాజుద్దిన్‌, స్వర్ణలత, రాజరామ్‌, సాయన్న, ప్రభాకర్‌, ప్రవీణ్‌, భూమేశ్వర్‌, పవన్‌, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ఖాళీల జాబితా విడుదల

నిజామాబాద్‌అర్బన్‌: కేజీబీవీలలో ఖాళీల భర్తీ కోసం దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో ప్రకటించారు. దీనికి సంబంధించిన ఖాళీల వివరాలను వెల్లడించారు. సంబంధిత వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. ఈనెల 26 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలవుతుందని ఆయన తెలిపారు.

పల్లె వెలుగు బస్సుల్లో టి-9 టికెట్‌

- 60 కిలోమీటర్ల పరిధిలో రానుపోనూ టికెట్‌ ధర రూ.100
- మహిళలు, వృద్ధులకు మాత్రమే



ఖలీల్‌వాడి: పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే మహిళలకు, వృద్ధులకు ఆర్థిక భారం తగ్గించేందుకు టీఎస్‌ఆర్టీసీ సంస్థ ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా టి-9 టికెట్‌ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. దీంతో నిజామాబాద్‌ ఉమ్మడి జిల్లాలోని మహిళలు, వృద్ధులకు లబ్ధిచేకూరనుంది. నిజామాబాద్‌ ఆర్టీసీ రీజినల్‌ పరిధిలోని (నిజామాబాద్‌-1, నిజామాబాద్‌-2, ఆర్మూర్‌, బోధన్‌, బాన్స్‌వాడ, కామారెడ్డి) ఆరు డిపోలలో ఆర్టీసీ బస్సులు, హైర్‌ బస్సులు కలిపి 308 బసులు అందుబాటులో ఉన్నాయి. ఈ బస్సులు పల్లెలోని ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తాయి. నిజామాబాద్‌ ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు ఎక్కువగా పల్లెవెలుగు బస్సులు అందుబాటులో ఉంటాయి. ఇందులో ఎక్కువగా మహిళలే ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. దీంతో నూతన టికెట్‌తో వారు లబ్ధిపొందనున్నారు.

ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు..

ఆర్టీసీ నూతనంగా ప్రవేశపెట్టిన టీ-9 టిక్కెట్లు పల్లెవెలుగు బస్సుల్లోనే అందుబాటులో ఉంటాయి. కండక్టర్‌తోనే ఈ టికెట్‌లు తీసుకునే వెసులుబాటు ఆర్టీసీ కల్పించింది. ఈ టికెట్లను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇవ్వనున్నారు. టీ-9 టికెట్‌ కోసం వృద్ధులు ఆధార్‌ కార్డు తప్పనిసరిగా కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది. మహిళలు, వృద్ధులు పల్లెవెలుగులో రూ.100కు టీ-9 టికెట్‌ తీసుకుంటే 60 కిలోమీటర్ల పరిధిలో ఒక్కసారి రానుపోనూ ప్రయాణం చేయవచ్చు. ఈ టికెట్‌ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు చెల్లుబాటు అవుతుంది. ప్రయాణికులు బస్సులో నేరుగా టికెట్‌ తీసుకుంటే ఎక్కువ ఛార్జీలు పడుతాయి. టీ-9 ద్వారా తీసుకోవడంతో ప్రయాణికులకు రూ.20 నుంచి 40 వరకు ఆదా అవుతుంది. కండక్టర్లు, ఆర్టీసీ అధికారులు గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులకు టీ-9 టికెట్‌పై అవగహన కార్యక్రమాలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆదాయం పెంచుకోవడానికే..

ఆర్టీసీకి ఆదాయం రాకపోవడంతో గతంలో కొన్ని గ్రామీణ ప్రాంతాలకు బస్సులను ఎత్తివేశారు. దీంతో ఆర్టీసీకి గ్రామీణ ప్రజలకు మధ్య దూరం పెరిగిపోయింది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులను తమ వైపు తిప్పుకోవడానికి ఆర్టీసీ తాజాగా టి-9 టిక్కెట్‌ పథకం ప్రవేశపెట్టింది. ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యం టి-24 టిక్కెట్‌, టి-6 టిక్కెట్‌ను పట్టణ ప్రాంతాల్లో తీసుకువచ్చింది. దీనితో సత్ఫలితాలు రావడంతో పాటు ఆర్టీసీకి ఆదాయం చేకూరింది. గ్రామీణ ప్రాంతాలలో టీ-9 పథకంతో పల్లెవెలుగు బస్సుల ద్వారా ప్రయాణికులకు మరింత చేరవై ఆదాయంతో పాటు ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గించాలని ఈ పథకం ప్రవేశపెట్టినట్లు తెలిసింది.

సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ నూతనంగా ప్రవేశపెట్టిన టీ-9 టికెట్‌ మహిళలు, వృద్ధులకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రయాణికులకు ఛార్జీలు తగ్గుతాయి. ఆదివారం నుంచి అమలు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాలలో అవగాహన కల్పిస్తాం. పల్లెవెలుగులో ఎక్కువగా మహిళలు, వృద్ధులే వస్తారు. ఈ టికెట్‌ను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి.

–ఉషాదేవి, ఆర్టీసీ రీజినల్‌,మేనేజర్‌, నిజామాబాద్‌

భూ ఆక్రమణదారుల దౌర్జన్యం!

- గుంజ్లీలో ఓ కుటుంబంపై దాడి
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

మాక్లూర్‌: ఇద్దరి మధ్య ఉన్న వ్యవసాయ భూమిలో హద్దును తొలగించి భూమి ఆక్రమించుకోవటంపై నిలదీసిన పాపానికి ఓ కుటుంబంపై స్థానికంగా ఉండే నలుగురు వ్యక్తులు దాడి చేసి, గాయపర్చారు. ఈ ఘటన ఆదివారం మండలంలోని గుంజ్లీ గ్రామ శివారులోని వ్యవసాయం పొలం వద్ద చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కదారి నడ్పి గంగాధర్‌ తన కుటుంబ సభ్యులతో కలిసి తన వ్యవసాయ భూమిలో వరి నారు పోయటానికి వెళ్లారు. ఈక్రమంలో తమ భూమి సరిహద్దు ధ్వంసం చేసి మరోచోటికి మార్చివేసినట్లు గమనించారు. ఇదే విషయమై అక్కడే ఉన్న గోపు చిన్న ఎర్రన్న, గోపు బోజేందర్‌, గోపు నరేందర్‌, శక్కరిలు ఆగ్రహంతో వచ్చి, దాడి చేసినట్లు బాధితులు గంగమణి, గంగాధర్‌లు విలపిస్తూ వెల్లడించారు. దాడి చేసిన వారందరూ బీఆర్‌ఎస్‌ మండల నాయకుడు గోపు రంజిత్‌ సొంత బాబాయ్‌లని, వారు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారన్నారు. ప్రస్తుతం బాధితులు జిల్లా కేంద్రప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారితో ప్రాణభయం ఉందని, తమకు న్యాయం చేయాలని పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

భూ కబ్జాపై ఫిర్యాదు..

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని యోగేశ్వర కాలనీలో ఓ బీజేపీ రాజకీయ నాయకుడు తన భూమి కబ్జా చేశాడని ఆర్మూర్‌ ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబుకు దొండి కుబీర్‌ ఆర్వింద్‌ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. యోగేశ్వర కాలనీలో సర్వే నెంబర్‌ 80లో 123 గజాల స్థలం కబ్జా చేసి ఆవార గోడ నిర్మించి, నిర్మాణం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

కోటగిరిలో వృద్ధురాలి అదృశ్యం


చిన్న భూమవ్వ

రుద్రూర్‌: కోటగిరి మండల కేంద్రానికి చెందిన చిన్న భూమవ్వ (64) అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈనెల 14న ఇంట్లో నుంచి వెళ్లిన భూమవ్వ ఇప్పటివరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భూమవ్వ కూతురు లావణ్య ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. ఆచూకి తెలిసిన వారు పోలీస్‌ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గోవుల అక్రమ రవాణా అడ్డగింత


గోవులను గోశాలలో అప్పగిస్తున్న యువకులు

బోధన్‌రూరల్‌(బోధన్‌): బోధన్‌ మండలంలోని కల్దుర్కి గ్రామం నుంచి రెంజల్‌ మండలంలోని సాటాపూర్‌కు అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని బీజేపీ, బజరంగ్‌దళ్‌ యువకులు అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని చిన్న మావంది వద్ద టాటా ఏసీ వాహనాన్ని శనివారం రాత్రి బజరంగ్‌దళ్‌, బీజేపీ యువకులు సీజ్‌ చేసి పట్టుకుని బోధన్‌ రూరల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం గోవులను బోధన్‌ గోశాలకు తరలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గోవులను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హిందు వాహిని, బీజేపీ, బజరంగ్‌దళ్‌ ప్రతినిధులు శేఖర్‌, వాసు, అజయ్‌, ముత్తయ్య లు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని బీటీనగర్‌ కాలనీలో పేకాట స్థావరంపై దాడి చేసి, ముగ్గురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటేశం ఆదివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌ బృందం పేకాట స్థావరంపై దాడి చేయగా ముగ్గురిని పట్టుకోగా, మిగతావారు పరారైనట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 6,600నగదుతో పాటు 8బైక్‌లు, 3సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డవారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, కేసునమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

రాంగ్‌రూట్‌ ప్రయాణం.. పలువురిపై కేసు



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని గాంధీవిగ్రహం వద్ద రాంగ్‌రూట్‌లో వచ్చిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌కుమార్‌ ఆదివారం తెలిపారు. ఎవరైనా రాంగ్‌రూట్‌లో వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అలాగే బ్యాంక్‌ కాలనీలో రాంగ్‌రూట్‌లో వచ్చిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు నాలుగోటౌన్‌ ఎస్సై సందీప్‌ తెలిపారు. ఇన్‌ఛార్జి సీపీ ప్రవీణ్‌కుమార్‌ ఆదేశాల మేరకు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహింస్తున్నట్లు వారు పేర్కొన్నారు. రాంగ్‌రూట్‌లో రావడంతో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున్న వాహనాదారులు రాంగ్‌రూట్‌లో రావద్దని వారు సూచించారు.

క్రైం కార్నర్‌

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ధర్పల్లి: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాస్తు వలలో చిక్కుకొని ఓ జాలరి మృతి చెందిన ఘటన ధర్పల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై వంశీకృష్ణరెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని హోన్నజిపేట్‌ గ్రామానికి చెందిన చల్లగర్గే బాలగంగాధర్‌ (60) ఆదివారం ఉదయం గ్రామంలోని చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో చేపల కోసం చెరువులో వల వేస్తుండగా, మెడకు చుట్టుకొని నీటిలో పడిపోయి గల్లంతయ్యాడు. వెంటనే గమనించిన తోటి జాలర్లు ఎంత వెతికినా అతడు కనబడలేదు. దీంతో వారు స్థానికులతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు రెస్క్యూ టీం, గజ ఈతగాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఐదు గంటలపాటు గాలింపు చర్యలు చేపట్టిన తర్వాత మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దుబ్బాకలో దొంగల బీభత్సం

మూడు ఇళ్లల్లో చోరీ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ధర్పల్లి: మండలంలోని దుబ్బాక గ్రామంలో దొంగల బీభత్సం సృష్టించారు. గ్రామంలోని శివారులోని ఉన్న మూడు ఇళ్లల్లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామంలోని భూర్ల గోపాల్‌, దార్ల మీనా, దుమాల మహిపాల్‌ రోజువారిగానే రాత్రి తమ ఇళ్లకు తాళాలు వేసి దాబాపైన నిద్రించారు. ఇదే అదునుగా గమనించిన దుండగులు వారి ఇళ్ల తాళాలను పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. భూర్ల గోపాల్‌ బీరువాను ధ్వంసం చేసి రెండు తులాల నెక్లెస్‌, చెవి కమ్మలను ఎత్తుకెళ్లారు. దార్ల మీనా ఇంట్లో రూ.30 వేల నగదుతో పాటు అర తులం బంగారు ఆభరణాలను అపహరించారు. దుమలా మహిపాల్‌ ఇంట్లో నుంచి ఒక తులం బంగారంతో పాటు రూ.7వేల నగదు ఎత్తుకెళ్లారు. ఉదయం లేచిన బాధితులు తమ ఇళ్లకు తాళాలు పగలగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గ్రహించారు. ఇంటి లోపల బీరువాలు పగలగొట్టి ఉండడం, సామన్లు చెల్లాచెదురుగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి క్లూస్‌ టీమ్‌తో వచ్చి ఆధారాలను సేకరించారు. గ్రామంలోని సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెట్రోల్‌ చోరీ దుండగుల పట్టివేత


బైక్‌ల నుంచి పెట్రోల్‌ తీస్తున్న దుండగులు

ఖలీల్‌వాడి: నగరంలోని రోటరీ నగర్‌ కాలనీలోని ఓ ఇంటి వద్ద బైక్‌ల నుంచి పెట్రోల్‌ దొంగలిస్తున్న ముగ్గురిని కాలనీవాసులు పట్టుకున్నట్లు తెలిసింది. వీరికి స్థానికులు దేహశుద్ధి చేసి, నాలుగో టౌన్‌ పోలీసులకు అప్పగించారు. ఎస్సై సందీప్‌ను వివరణగా కోరగా విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

బిచ్కుంద(జుక్కల్‌): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను తహసీల్దార్‌ భరత్‌ పట్టుకున్నారు. ఖద్‌గాం, హజ్గుల్‌, పుల్కల్‌ క్వారీ నుంచి రాత్రి సమయంలో ఇసుక తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో శనివారం రాత్రి ఆకస్మిక దాడులు చేసి నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. ట్రాక్టర్లపై కేసునమోదు చేస్తామని తహసీల్దార్‌ తెలిపారు.

ఐఐటీ అడ్వాన్స్‌డ్‌లో 'కాకతీయ' ప్రతిభ


ఉత్తమ ర్యాంక్‌ సాధించిన సిద్ధార్థను సన్మానిస్తున్న కాకతీయ కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ కవిత


రిషికిరణ్‌


అక్షయ్‌


చేతన్‌


సాయిచరణ్‌

నిజామాబాద్‌అర్బన్‌: ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఫలితాల్లో నగరంలోని కాకతీయ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో పలువురు విద్యార్థులు 9 జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు. ఈసందర్భంగా కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్‌ రామోజీరావ్‌ మాట్లాడుతూ.. కాకతీయ విద్యార్థులు జాతీయస్థాయిలో సత్త చాటాడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వచ్చే ఏడాది మరిన్ని ర్యాంకులు సాధిస్తామన్నారు. అలాగే కాకతీయకు ఇంటర్‌, ఎంసెట్‌, నీట్‌ ఫలితాల్లో సైతం మంచి ఫలితాలు రావడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.

వెక్టర్‌ కళాశాలకు ర్యాంకులు..


రిషికేష్‌

నగరంలో వెక్టర్‌ కళాశాలకు ఐఐటి జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు వచ్చినట్లు కళాశాల చైర్‌పర్సన్‌ మధుసూదన్‌ జోషి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

ఎస్‌ఆర్‌ కళాశాలలో..


చంద్రశేఖర్‌

నగరంలో ఎస్‌ఆర్‌ కళాశాల విద్యార్థులు సైతం ఐఐటి జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఫలితాల్లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించినట్లు జోనల్‌ ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు.

జాతీయస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు

విద్యార్థి	ర్యాంకు	కళాశాల
ఎం రిషికిరణ్‌	318	కాకతీయ
వి సాయి అక్షయ్‌	1386	కాకతీయ
కె చేతన్‌	1734	కాకతీయ
జి సాయిచరణ్‌	1818	కాకతీయ
ఏ సిద్ధార్థ	2178	కాకతీయ
సాత్విక్‌	5097	కాకతీయ
భువనకృతి	6239	కాకతీయ
ఆస్మాపిర్దోష్‌సిద్దిఖి	6378	కాకతీయ
వైభవ్‌	7133	కాకతీయ
రిషికేష్‌	3735	వెక్టర్‌
వినయ్‌	7683	వెక్టర్‌
జాదవ్‌ చంద్రశేఖర్‌	604	ఎస్‌ఆర్‌
దరవాత్‌ అరవింద్‌	1118	ఎస్‌ఆర్‌

కామారెడ్డి జిల్లాలో..


మాలోత్‌ సుష్మిత

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని గిరిజన బాలికల గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థిని మాలోత్‌ సుష్మిత ఐఐటి జేఈఈ ఫలితాలలో ఆల్‌ఇండియా 423వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపల్‌ వాణి ఒక ప్రకటనలో తెలిపారు.ఈసందర్భంగా సుష్మితను ప్రిన్సిపల్‌తో పాటు సిబ్బంది అభినందించారు.


బి వికాస్‌


పూర్ణచందర్‌

కామారెడ్డి టౌన్‌: ఐఐటి జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని సాందీపని కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వికాస్‌ ఆల్‌ ఇండియా 1557 ర్యాంక్‌ సాధించాడు. ఇదే విద్యార్థి జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 412 ర్యాంకు సాధించాడు. అలాగే ఇటీవల విడుదలైన నీట్‌ ఫలితాల్లో పూర్ణచందర్‌ విద్యార్థి 511 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభచాటారు. ఈ విద్యార్థులను జిల్లా ఇంటర్మీడియట్‌ నోడల్‌ అధికారి షేక్‌ సలాం, కళాశాల డైరెక్టర్లు పెంటయ్య, జనార్దన్‌, డైరెక్టర్లు బాలాజీరావు, ప్రిన్సిపాల్‌ సాయిబాబాలు ఘనంగా సన్మానించారు.


నేనావత్‌ కళ్యాణ్‌

నస్రుల్లాబాద్‌: నస్రుల్లాబాద్‌ మండలం సంగం గ్రామానికి చెందిన నేనావత్‌ కళ్యాణ్‌ అనే విద్యార్థికి ఐఐటి జేఈఈలో జాతీయ స్థాయి ర్యాంకు వచ్చినట్లు ఎంపీపీ పాల్త్య విఠల్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన విద్యార్థి ఎస్టీ కేటగిరిలో జాతీయ స్థాయిలో 7వ ర్యాంకు వచ్చిందని, సీఆర్‌ఎల్‌లో 1455ర్యాంకు రావడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థిని ఆదివారం ఎంపీపీ ఫోన్‌లో అభినందించారు. సదరు విద్యార్థిని 'సాక్షి' ఫోన్‌లో పలకరించగా తాను పదో తరగతి వరకు చందూర్‌లోని శ్రీసాయి స్కూల్‌లో, ఇంటర్‌ శ్రీ చైతన్య ఐఐటీ అకాడమీ అమీన్‌ పూర్‌ చదివానన్నారు.

రైతన్నకు తీరనున్న కరెంట్‌ కష్టాలు


నిజాంసాగర్‌ మండలంలో కర్రల సాయంతో ఏర్పాటు చేసిన కరెంటు వైర్లు

- పొలాల్లో విద్యుత్‌ స్తంభాలు, వైర్ల ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

నిజాంసాగర్‌(జుక్కల్‌): వ్యవసాయరంగ కరెంట్‌ కష్టాలపై టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ సంస్థ ప్రత్యేక శ్రద్ధ కనబర్చింది. బోరు మోటార్లు, లిఫ్టులకు కరెంట్‌ సరఫరా ఇబ్బందులను దూరం చేయడంతో పాటు త్రిఫేజ్‌ విద్యుత్‌ సరఫరాకు చర్యలు చేపట్టింది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో రూ. 9కోట్లతో పనులు

జిల్లాలోని 7 విద్యుత్‌ సబ్‌స్టేషన్ల పరిధిలోని 16 ఫీడర్లల్లో రూ. 9 కోట్లతో వ్యవసాయ రంగానికి కరెంట్‌ కష్టాలు లేకుండా చేస్తోంది. సిస్టం స్టెంతనింగ్‌ పేరిట ట్రాన్స్‌కో వ్యవసాయ విద్యుత్‌ కనెక్షన్ల సమస్యలను అధిగమించేలా పనులకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని ఆయా గ్రామాల్లో పనులు జోరుగా చేపడుతున్నారు.

కర్రల స్థానంలో స్తంభాలు..

జిల్లాలోని చద్మల్‌, భవానిపేట, మహమ్మద్‌నగర్‌, శాంతపూర్‌, మాచారెడ్డి ఫీడర్లల్లో సిస్టం స్టెంతనింగ్‌ పనులు జోరుగా చేపడుతున్నారు. ఆయా ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉన్న వ్యవసాయ విద్యుత్‌ కనెక్షన్ల వినియోగదారులకు కరెంట్‌ కష్టాలు లేకుండా పనులు చేపడతున్నారు. గతంలో విద్యుత్‌ కనెక్షన్‌ కోసం డీడీలు కట్టి, కరెంట్‌ కనెక్షన్లు పొందినా సరైన సామగ్రి లేకపోవడంతో కర్రలపై కరెంట్‌ వైర్లను రైతులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ఆయా ఫీడర్లల్లో ఉన్న కర్రల స్థానంలో సిమెంట్‌ స్తంభాలు, విద్యుత్‌ వైర్లు, ఇతర సామగ్రిని విద్యుత్‌ వినియోగదారులకు చెంతకు తీసుకు వచ్చారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్లపైన ఓవర్‌ లోడ్‌ సమస్యను అధిగమించడంతో పాటు అవసరమైన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు కరెంట్‌ సమస్యలను తీరుస్తుండటంతో ఆయా ఫీడర్ల పరిధిలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




కర్రల స్థానంలో వేసిన సిమెంట్‌ స్తంభాలు.. నర్వ గ్రామంలో కరెంట్‌ తీగలు, సామగ్రి, వాహనాలు

'స్తంభానికి డబ్బులు' ఘటనపై నేడు విచారణ

నిజామాబాద్‌నాగారం: ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన స్తంభానికి డబ్బులు డిమాండ్‌ అనే కథనానికి విద్యుత్‌శాఖ జిల్లా, ఉన్నతాధికారులు స్పందించారు. ఇప్పటికే కన్‌స్ట్రక్షన్‌ డీఈ వెంకటరమణ జెఎల్‌ఎమ్‌ రవిని విచారించిన విషయం తెలిసిందే. మూడు రోజుల క్రితం ఐదుగురికి నోటీసులు ఇంచ్చారు. సోమవారం నోటీసులు అందుకున్న ఏఈ, లైన్‌ఇన్‌స్పెక్టర్‌, లైన్‌మెన్‌, జెఎల్‌ఎమ్‌, సంబంధిత కార్పొరేటర్‌ను సైతం విచారణ చేయనున్నారు.